పేదల గృహాల్లో విద్యుత్ వెలుగులు

- ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్
- నియోజకవర్గంలో 25 వేల గృహాలకు లబ్ధి
- ఏడాదికి రూ.8.40 కోట్ల సబ్సిడీ
- జగ్జీవన్‌రామ్ జీవన జ్యోతి యోజనతో పేదలకు ఆర్థిక ఆసరా


ఇబ్రహీంపట్నం జగనన్న కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. కొన్ని పథకాలతో అర్హుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తోంది. మరికొన్ని పథకాలకు సబ్సిడీ రూపంలో అమలు చేస్తోంది. కొన్ని ఉచితంగా అందిస్తోంది. ఇందులో భాగంగా జగ్జీవన్‌రామ్ జీవన జ్యోతి యోజన అమలు చేస్తోంది. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు 2019 ఆగస్టు నెల నుంచి 200 యూనిట్ల లోపు విద్యుత్ ఉచితంగా అందిస్తోంది. మైలవరం నియోజక వర్గం పరిధిలో సుమారు 25 వేల మంది వరకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ పొందుతున్నారు. వీరికి ప్రతి నెలా సుమారు రూ.70 లక్షల చొప్పున ఏడాదికి రూ. 8.40 కోట్ల వరకు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో భరిస్తోంది.

ఇచ్చిన హామీ నెరవేర్చిన సీఎం జగన్

సార్వత్రిక ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని అధికారం చేపట్టిన మూడు నెలల్లోనే అమలు చేసి చూపారు. గత టీడీపీ ప్రభుత్వం 50 యూనిట్లకు ఉచిత విద్యుత్ పథకాన్ని పరిమితం చేయడంతో అర్జీ పెట్టేందుకు కూడా అనేకమంది ముందుకు రాలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ నెరవేర్చడంతో ఎస్సీ, ఎస్టీలు పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రతి నెలా 200 యూనిట్లు ఉపయోగించుకుని కరెంట్ బిల్లు రాకుండా పొదుపుగా వాడుకుంటున్నారు. ఒక్కో కుటుంబానికి ప్రతి నెలా సుమారు రూ.500 నుంచి రూ.700 వరకు మిగులుతున్నాయి.

జగనన్న కాలనీలకు విద్యుత్ కనెక్షన్లు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా పూర్తవుతున్నాయి. ఇళ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే విద్యుత్ శాఖ అధికారులు లబ్ధిదారుల నుంచి అర్జీలు స్వీకరించి మీటర్లు బిగిస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 20 వేల ఇంటి స్థలాలు కేటాయించగా ఇప్పటికే 10 వేల వరకు పూర్తయ్యాయి. గృహ ప్రవేశాలు చేసిన 1500 మందికి విద్యుత్ కనెక్షన్లు అమర్చారు. మొత్తం1,25,131 విద్యుత్ కనెక్షన్లు ఉండగా ఎస్సీ, ఎస్టీ సబ్సిడీ కనెక్షన్‌లు 25 వేల వరకు ఉన్నాయి. మరికొన్నింటిని అమర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాలనీలకు అవసరమైన విద్యుత్ సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, పోల్స్, లైన్లు, వీధిలైట్లు అమర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటు మంజూరు చేసింది. ప్రభుత్వ కాలనీలోనే కాకుండా సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి కూడా మీటర్లు అమర్చి అర్హతను బట్టి జగ్జీవన్ జ్యోతి పథకం వర్తింపజేస్తూ సబ్సిడీ అమలు చేస్తున్నారు.

ఏడాదికి రూ. 6వేల వరకు ఆదా



జగనన్న అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ పథకం మా కుటుంబానికి అసరాగా నిలిచింది. గత ప్రభుత్వంలో ప్రతి నెలా రూ.400 నుంచి రూ.500 వరకు బిల్లు కట్టాం. ఇప్పుడు పొదుపుగా వాడుకుంటున్నాం. నెలకు సుమారు రూ.500 చొప్పున ఏడాదికి రూ. 6 వేల వరకు కరెంటు బిల్లుపై మిగులుతున్నాయి.

– బాణావత్ నాగబాలమ్మ, లబ్ధిదారురాలు, జూపూడి

జగనన్న ఇచ్చిన హామీ నెరవేర్చారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉచిత విద్యుత్ హామీ నెరవేర్చి పేదల జీవితాల్లో వెలుగులు నింపారు. నాకున్న చిన్న డాబా ఇంట్లో రెండు ఫ్యాన్లు, మూడు బల్బులు వాడుతున్నాం. 200 యూనిట్లు దాటడం లేదు. గత ప్రభుత్వంలో కరెంట్ బిల్లు వస్తే భయమేసేది. ఇప్పుడు ఆ భయం లేదు. ప్రభుత్వమే కరెంటు బిల్లు భరిస్తోంది.

– భుక్యా సీత, లబ్ధిదారురా, కిలేశపురం

రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబర్చాలి

ఆర్డీఓ భవానీ శంకరి


జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టును అభినందిస్తున్న ఆర్డీఓ భవానీ శంకరి

నూజివీడు: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన నూజివీడు నియోజకవర్గ జట్లు రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలవాలని ఆర్డీఓ వై. భవానీ శంకరి ఆకాంక్షించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్లను శనివారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో గెలుపొందిన ఆటగాళ్లు రూ.5.40 లక్షల వరకు నగదు బహుమతులను అందుకున్నారన్నారు. వ్యాయామోపాధ్యాయులు కూడా తమ వంతు పాత్ర పోషించి నియోజకవర్గానికి చెందిన ఆటగాళ్లు మరింత ప్రతిభతో రాణించేలా వారికి శిక్షణనివ్వాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని నైపుణ్యం కలిగిన క్రీడాకారులను వెలుగులోకి తీసుకు వచ్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడా సంబరం నిర్వహిస్తోందని వివరించారు. కార్యక్రమంలో డీవైఈఓ ఎం.సేవియా, ఆడుదాం ఆంధ్రా కో–ఆర్డినేటర్ రవీంద్ర, సబ్ జోన్ సెక్రటరీ సుగుణరావు, కోశాధికారి సతీష్, వ్యాయామోపాధ్యాయులు నాగరాజు, సరళ, సుకుమార్, నాగేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, రాణి, ఆరతి పాల్గొన్నారు.

మరిన్ని విజయాలు సాధించాలి


విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

మైలవరం: జేఎన్‌టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ బాల్ బ్యాడ్మింటన్ (మెన్, విమెన్) ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్ ట్రైల్స్ (2023–24)పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రథమస్థానంలో నిలిచారని మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల (ఎల్బీఆర్‌సీఈ) ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు తెలిపారు. కళాశాలలో శనివారం జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ ఫిబ్రవరి 1, 2 తేదీలలో నూజివీడులోని శ్రీ సారథి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో పోటీలు జరిగాయన్నారు. ఇందులో బాలుర విభాగంలో 13 టీమ్‌లు పాల్గొనగా ఎల్బీఆర్‌సీఈ విద్యార్థులు ప్రథమ స్థానంలో గెలుపొందారన్నారు. షేక్ ఖాజా మొయుద్దీన్, షేక్ జాన్‌బాషా, ఎ.శివారెడ్డిలు యూనివర్సిటీ స్థాయిలో ఎంపిక అయ్యారన్నారు. బాలికల విభాగంలో 6 టీమ్‌లు పాల్గొనగా ఎల్బీఆర్‌సీఈ విద్యార్థినులు తృతీయ స్థానంలో నిలిచారని చెప్పారు. గెలుపొందిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ ఎన్వీ రాజ్‌కుమార్, అసిస్టెంట్ పీడీలు ఎస్. దుర్గారెడ్డి, ఎం. బేబీరాణిలను ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

క్లుప్తంగా

వైభవంగా రజ్జబ్ పండుగ



ఎ.కొండూరు: చీమలపాడు ఏఏఎంటీకే దర్బార్‌లో శనివారం రజ్జబ్ (కజ్జికాయల) పండుగ పీఠాధిపతి సజ్జద నసీన్ మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా తాజ్ ఖాదరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పవిత్రగంధం సమర్పించి జెండా గంధ మహోత్సవాన్ని నిర్వహించి జెండా ఆవిష్కరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి కులమతాలకు అతీతంగా వచ్చిన భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రసాదాన్ని స్వీకరించారు. జాఫర్‌షరీఫ్, తాజ్ ఖాదర్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం

పెనుగొలను(గంపలగూడెం): జాతీయ మహిళా వైద్యుల దినోత్సవాన్ని శనివారం గంపలగూడెం మండలం పెనుగొలనులో షిర్డీ సాయి బాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ మొట్టమొదటి మహిళా వైద్యులు ఆనందిగోపాల్ జోషి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా షిర్డీ సాయి బాబా సేవా కమిటీ సభ్యులు మాట్లాడుతూ సమాజంలో మహిళా వైద్యులు గణనీయంగా సేవలను అందజేస్తున్నారని కొనియాడారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం

అనుముల్లంక(గంపలగూడెం): జల్ జీవన్ మిషన్ పనుల్లో భాగంగా గంపలగూడెం మండలం అనుముల్లంకలో గ్రామస్తులకు మంచి నీటి సరఫరాకై రూ.27లక్షలతో పైప్‌లైన్ ఏర్పాటు పనులను సర్పంచ్ అత్తునూరి దీప్తి కొబ్బరికాయ కొట్టి శనివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మంజూరైన నిధులతో కట్టిలేరు నుంచి వాటర్ ట్యాంక్ వరకు 2,900 మీటర్ల పొడవును మెయిన్ పైప్‌లైన్, 900మీటర్ల పొడవును గ్రామంలో అంతర్గత రహదార్లలో పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామని వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ధనికొండ భుపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మద్దాల ప్రసాదం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గంపలగూడెం: త్వరలో సాధారణ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎస్ఐ ఎస్. శ్రీను సెక్టార్ ఆఫీసర్లతో కలిసి శనివారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కొణిజెర్ల, తునికిపాడు, దుందిరాలపాడు, మేడూరు, ఆర్లపాడు, గుళ్ళపూడి, లింగాల, సొబ్బాల, గంపలగూడెంలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో ఎన్నికల సంఘం ఆదేశానుసారం ఏర్పాటు చేయాల్సిన వసతులను, శాంతిభద్రతల పరిస్థితిని ఎస్ఐ చర్చించారు.

నాలుగో యూనిట్‌లో 100 రోజుల వేడుక



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ నాలుగో యూనిట్ నిరంతరాయంగా వంద రోజులు విద్యుత్ ఉత్పత్తి పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా సంస్థ కార్యాలయంలో వంద రోజుల వేడుకను శనివారం నిర్వహించారు. సంస్థ చీఫ్ ఇంజినీర్ నవీన్‌గౌతమ్ కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇంతటి ఘన విజయం సాధించేందుకు కృషిచేసిన సంస్థ ఇంజినీర్లు, ఉద్యోగులు, కార్మికులకు అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో అన్ని యూనిట్లు నిరంతరాయంగా పనిచేసేలా కృషి చేయాలన్నారు. ఎస్ఈ వెంకటరావు, ఈఈ శ్రీనివాసరెడ్డి, డీవైఈఈ కిరణ్, ఏఈ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పీజీ విద్యార్థుల ఆన్‌లైన్ వెబినార్

నూజివీడు: కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సెస్‌లో మూడు రోజుల పాటు స్టాటిస్టిక్స్ విద్యార్థులకు నిర్వహించిన ఆన్‌లైన్ వెబినార్ శనివారం ముగిసింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టాటిస్టిక్స్, స్టాట్ ఇన్ఫర్మేషన్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్టాటిస్టికల్ డేటా విజువలైజేషన్ యూజింగ్ పవర్ బీఐ అంశంపై వెబినార్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆచార్య మండవ వెంకట బసవేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆయా రంగాల్లో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులు, నూతన ఆవిష్కరణలను తెలుసుకోవాలన్నారు. వెబినార్‌లో 160 మంది వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. కో–ఆర్డినేటర్ సీవీ శాస్త్రి, అధ్యాపకులు కె. అవినాష్, డి.తేజశ్వేత పర్యవేక్షించారు.

రాంపిళ్ల లక్ష్మణ గురుస్వామికి నివాళి

గంపలగూడెం: రాంపిళ్ల లక్ష్మణ గురుస్వామి ఎనిమిదో వర్ధంతి కార్యక్రమం గంపలగూడెం గాంధీ సెంటర్‌లో మండల అయ్యప్ప దీక్షాపరుల సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అనంతరం అన్నదానం చేశారు.

బీసీ ఇన్‌చార్జితో నయా జోష్

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా సర్నాల తిరుపతిరావు



జి.కొండూరు: వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎంపికలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. మైలవరం నియోజకవర్గం ఏర్పడిన 1955వ సంవత్సరం నుంచి 14 సార్లు జరిగిన శాసనసభ ఎన్నికలలో అగ్ర కులానికి చెందిన వ్యక్తులే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అయినప్పటికీ నియోజకవర్గంలో ఒక లక్షకు పైగా ఉన్న బీసీ సామాజిక వర్గానికి చెందిన మైలవరం జెడ్పీటీసీ సభ్యుడు, సామాన్యుడు సర్నాల తిరుపతిరావు (బీసీ యాదవ)ను మైలవరం ఇన్‌చార్జిగా ప్రకటించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల పట్ల చిత్తశుద్ధిని చాటుకున్నారని స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

రాజకీయ నేపథ్యం..

సర్నాల తిరుపతిరావు సామాన్య రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి. మైలవరంలో 1985 ఫిబ్రవరి 15న జన్మించిన ఆయన పదో తరగతి వరకు చదువుకున్నారు. తండ్రి సర్నాల చిన్న జమలయ్య సహకార బ్యాంకులో అటెండర్‌గా పనిచేస్తున్నారు. తల్లి సర్నాల మద్దిరావమ్మ, భార్య సర్నాల నాగలక్ష్మి, కుమారుడు మణికంఠ, కుమార్తె భవాని ఉన్నారు. తమ్ముళ్లు సర్నాల తిరుపతి వెంకయ్య ఫైర్ స్టేషన్ కానిస్టేబుల్‌గా పనిచేస్తుండగా రెండో తమ్ముడు సర్నాల స్వామి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. 2013లో రాజకీయాల్లోకి వచ్చిన తిరుపతిరావు 2014 నుంచి 2019 వరకు వైఎస్సార్ సీపీ మైలవరం మండల కార్యదర్శిగా పనిచేశారు. 2021లో మైలవరం జెడ్పీటీసీగా 16వేలు ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

తలలు పట్టుకుంటున్న ప్రతిపక్ష పార్టీలు

మైలవరం నియోజకవర్గ అభ్యర్థులుగా బరిలోకి దింపేందుకు ఇప్పటి వరకు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులను పరిశీలించిన ప్రతిపక్ష పార్టీలు, వైఎస్సార్ సీపీ యాదవ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ఇన్‌చార్జిగా ప్రకటించడంతో తలలు పట్టుకుంటున్నాయి. బీసీలు అధికంగా ఉన్న నియోజకవర్గం కావడంతో తాము కూడా బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులనే అభ్యర్థులుగా ప్రకటిస్తే ఎలా ఉంటుందనే ఆలోచనలో పడ్డారు. దీనిపై ప్రజాభిప్రాయ సేకరణ చేసేందుకు సర్వేలు ప్రారంభించారు.

దారులన్నీ దెందులూరుకు


విస్సన్నపేటలో జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న స్వామిదాసు, నాయకులు


గుంటుపల్లిలో బస్సును ప్రారంభిస్తున్న మండల సచివాలయాల కన్వీనర్ కె.వెంకటేష్ తదితరులు


ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం నుంచి తరలి వెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

సిద్ధం సభకు భారీగా తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

మైలవరం/తిరువూరు/నూజివీడు: ఏలూరు జిల్లా దెందులూరులో శనివారం నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభకు మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు తరలివెళ్లారు. బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాల్లో ర్యాలీగా ఆయా ప్రాంతాల నుంచి బయలుదేరి వెళ్లారు. వాహనాలను ఆయాప్రాంతాల్లో స్థానిక నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. మైలవరం మండలంలోని పుల్లూరు గ్రామంలో నియోజక ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు, చంద్రాల గ్రామంలో జె. గంగాధరరావు జెండా ఊపి బస్‌లు, కార్లను ప్రారంభించారు. నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంతో కదలి వెళ్ళడం పండుగ వాతావరణాన్ని తలపించింది.

➡ **జి.కొండూరు:** మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి 24 బస్సులు, ప్రత్యేక వాహనాలలో ప్రజలు, అభిమానులు, నాయకులు సిద్ధం సభకు భారీగా తరలివెళ్లారు. మండల నాయకులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

సిద్ధం సభకు తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

➡ **ఇబ్రహీంపట్నం:** దెందులూరులో ఏర్పాటు చేసిన సిద్ధం సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు శనివారం తరలి వెళ్లారు. గుంటుపల్లి, జూపూడి, ఈలప్రోలు తదితర గ్రామాల నుంచి మండల సచివాలయాల కన్వీనర్ కోసూరు వెంకటేష్, మండల ఎస్టీ సెల్ కన్వీనర్ బాణావత్ బాలాజీ, తదితర ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు బయలుదేరి వెళ్లారు.

➡ **తిరువూరు:** తిరువూరు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు ఆధ్వర్యంలో అన్ని మండలాల్లోని గ్రామాల్లో మహిళలు, యువకులు ప్రత్యేక బస్సులు, మినీ వ్యాన్లలో దెందులూరు వెళ్లారు. వైఎస్సార్ సీపీ తిరువూరు మండల, పట్టణ అధ్యక్షులు శీలం నాగనర్సిరెడ్డి, చలమాల సత్యనారాయణ, సర్పంచులు, నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు పర్యవేక్షించారు.

➡ **గంపలగూడెం:** మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాలు, కార్లలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు జెండాలను చేబూని ఉత్సాహంగా తరలివెళ్లారు. తునికిపాడులో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

➡ **తిరువూరురూరల్:** మండలంలోని మునుకుళ్ళ, కోకిలంపాడు, అక్కపాలెం, వామకుంట్ల, వావిలాల, ఎర్రమాడు, చిట్టేల, ఆంజనేయపురం, చౌటపల్లి, చింతలపాడు, రోలుపడి, గానుగపాడు, మల్లేల, కొమ్మిరెడ్డిపల్లి, పెద్దవరం తదితర గ్రామాల నుంచి బస్సులు, మినీ వ్యాన్లలో మహిళలు, యువకులు దెందులూరుకు తరలి వెళ్లారు.

➡ **ఆగిరిపల్లి:** సిద్ధం సభకు మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, మహిళలు భారీగా తరలి వెళ్లారు. 25 పంచాయతీల నుంచి బయల్దేరిన బస్సులను పార్టీ మండలాధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు జెండా ఊపి ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

➡ **నూజివీడు:** సిద్ధం సభకు నూజివీడు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు తరలి వెళ్లారు. 4 మండలాలు, పట్టణం నుంచి సుమారు 15 వేలకు మందికి పైగా పార్టీ శ్రేణులు వివిధ వాహనాల్లో బయల్దేరి వెళ్లారు.

➡ **చాట్రాయి:** సిద్ధం సభకు మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. బూరుగుగూడెంలో ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి జెండాను ఊపి బస్సులను ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు తరలి వెళ్లారు.

➡ **విస్సన్నపేట:** సిద్ధం సభకు బస్సులు, కార్లలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు భారీరీగా తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి స్థానిక రాణి కల్యాణమండపం వద్ద పార్టీ జెండాను ఊపి బస్సులను ప్రారంభించారు.

➡ **ముసునూరు:** మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు వేలాది మంది తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, జి.రంగారావు, ప్రజాప్రతినిధులు, నాయకులు తరలివెళ్లారు.

రాజ్యాంగ ప్రవేశిక పుస్తకావిష్కరణ



తిరువూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగంలోని పలు ముఖ్యాంశాలతో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో కృష్ణా–గుంటూరు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రాసిన రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాన్ని శనివారం తిరువూరులో ఆవిష్కరించారు. స్థానిక మండల విద్యా శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు మచ్చా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు భరతకుమారి, ఉషారాణి, ఎంఈఓ శ్యాం సుందర్, యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వినయ్‌కుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం ఎస్ఐ గోవింద్ బాధ్యతల స్వీకారం



రెడ్డిగూడెం: రెడ్డిగూడెం ఎస్ఐగా యు. గోవింద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నున్న పోలీస్‌స్టేషన్ నుంచి రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు.

ఎల్ఐసీ నిర్వీర్యానికి యత్నం


తిరువూరు: భారతదేశ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలుస్తున్న భారతీయ జీవిత బీమా సంస్థను నిర్వీర్యం చేసేందుకు కేంద్రప్రభుత్వం యత్నిస్తోందని ఆలిండియా ఎల్ఐసీ ఏజెంట్ల ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి రవికిషోర్ విమర్శించారు. తిరువూరు శాటిలైట్ శాఖ పరిధిలో ఆర్గనైజేషన్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ప్రపంచ దేశాల్లో ఐదో స్థానంలో ఉన్న భారతీయ జీవిత బీమా సంస్థను ప్రైవేటీకరించాలని కేంద్రం యత్నించడం శోచనీయమన్నారు. ఆర్గనైజేషన్ స్థానిక ప్రతినిధులు కోటేశ్వరరావు, ఫరీద్‌బాబు, పంతంగి శ్రీనివాసరావు, గాంధీ, జీఆర్‌కే రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్టీఆర్ జిల్లా స్థాయి పోటీలు


కబడ్డీ క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

విజయవాడస్పోర్ట్స్: ఆడుదాం ఆంధ్రా ఎన్టీఆర్ జిల్లా స్థాయి పోటీలు శుక్రవారం రాత్రి ముగిశాయి. క్రికెట్, బ్యాడ్మింటన్ (డబుల్స్), వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో మూడు రోజుల పాటు ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్, దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరిగాయి. తిరువూరు, జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, విజయవాడ పశ్చిమ, విజయవాడ సెంట్రల్, విజయవాడ తూర్పు నియోజకవర్గాల జట్లు ఈ పోటీలకు ప్రాతినిథ్యం వహించాయి. క్రికెట్ పురుషుల విభాగంలో విజయవాడ తూర్పు, విజయవాడ సెంట్రల్, జగ్గయ్యపేట నియోజకవర్గాల జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. మహిళల విభాగంలో విజయవాడ తూర్పు, సెంట్రల్, తిరువూరు జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. కబడ్డీ పురుషుల విభాగంలో జగ్గయ్యపేట, విజయవాడ తూర్పు, నందిగామ, మహిళల విభాగంలో మైలవరం, విజయవాడ సెంట్రల్, తిరువూరు, బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో విజయవాడ తూర్పు, తిరువూరు, నందిగామ, మహిళల విభాగంలో జగ్గయ్యపేట, విజయవాడ సెంట్రల్, విజయవాడ పశ్చిమ, వాలీబాల్ పురుషుల విభాగంలో విజయవాడ సెంట్రల్, మైలవరం, నందిగామ, ఖోఖో పురుషుల విభాగంలో నందిగామ, తిరువూరు, మైలవరం, మహిళల విభాగంలో విజయవాడ పశ్చిమ, తిరువూరు, విజయవాడ సెంట్రల్ జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాయని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్.ఎ.అజీజ్ తెలిపారు. వాలీబాల్ మహిళల విభాగంలో మైలవరం, విజయవాడ సెంట్రల్ ప్రథమ, ద్వితీయస్థానంలో నిలిచాయన్నారు. విజేతలకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఏఓ పి.రామకృష్ణ ట్రోఫీలు, సర్టిఫికెట్‌లు అందజేశారు.

విద్యార్థినులకు అభినందన



తిరువూరు: విజయవాడలో శుక్రవారం జరిగిన ఎన్టీఆర్ జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీల్లో తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినుల జట్టు తృతీయ స్థానంలో నిలిచిందని ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎన్ రాజు తెలిపారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులను, శిక్షణ ఇచ్చిన పీఈటీ సుకన్యలను ఉపాధ్యాయులు అభినందించారు.

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు ఉత్తర్వులు

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి రఘునాథ స్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దేవదాయ శాఖ కాకినాడ ఉప కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేశారని ఆలయ ఈఓ ఆకుల కొండలరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 21వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎంపీడీఓ విష్ణుప్రసాద్‌కు సన్మానం

రెడ్డిగూడెం: బదిలీపై వెళుతున్న ఎంపీడీఓ వి. విష్ణుప్రసాద్‌ను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. మంచి సేవలు అందించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని పలువురు కొనియాడారు. జెడ్పీటీసీ పాలంకి విజయ భాస్కరరెడ్డి, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు, ఎంపీటీసీ కుప్పిరెడ్డి వర ప్రసాద్‌రెడ్డి, రెడ్డిగూడెం మండల సచివాలయ కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు వీరమళ్ల సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ విద్యపై అవగాహన

ఇబ్రహీంపట్నం: భవిత కేంద్రాల్లో దివ్యాంగులు ట్యాబ్‌లు వినియోగించే విధానంపై ఐఈఆర్టీలు, ఐడీఎస్ఎస్ ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు ఎంపీపీ కార్యాలయంలో శనివారం జరిగింది. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆ సంస్థ జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ జి.మహేశ్వరరావు మాట్లాడుతూ దివ్యాంగులకు డిజిటల్ విద్యను చేరువ చేసేందుకు ట్యాబ్స్ అందజేశామన్నారు. వాటి ద్వారా దివ్యాంగులకు డిజిటల్ విద్య అందించాలన్నారు. ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. రాష్ట్ర కో–ఆర్డినేటర్ అమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.